తమదాకావస్తే దండధరులంతా కార్యశూరులవుతారా? ఫలితాన్ని పక్కకు నెట్టి ప్రతిష్ఠకై పాకులాడే సంస్కర్తల కాలం చెల్లిపోవాలి!

# ఆత్మవంచన



విమలారామం

సుందరంగారు 'మీటింగు'కు వెళ్ళేటప్పుడు ఉత్తచేతులతో వెళ్ళినా తిరిగి వచ్చేటప్పుడు 'ఇంత' పెద్దదండ చేత్తోపట్టుకు వచ్చేసరికి కాత్యాయని కళ్ళింత చేసుకు చూసింది:

"ఏమిటలా చూస్తావ్?" అని కులాసాగా నవ్వారు సుందరంగారు.

"మీరు వెళ్ళింది మీటింగుకా – పెళ్ళి పందిట్లోకా అని!"

"నయం మరో పెళ్ళి చేసుకొచ్చారా అని అడిగావు కాదు."

"మీ సంబరం చూస్తుంటే అలాగే ఉంది!" అంది కాత్యాయని మూతి త్రిప్పుతూ.

సుశీలకి చేతిలోని దండ అందిస్తూ "చూశావా అమ్మాయ్! ఇదీ మీ అమ్మ వరస...." అన్నాడాయన.

"బహూశ నాన్ననికూడా స్టేజీమీదకి పిల్చారేమోనమ్మా!" అంది సుశీల చిన్నగా నవ్వుతూ.

"దానికున్న తెలివి నీకు లేకపోయింది" అని ఎకసెక్కమాడారు సుందరంగారు.

"ఊఁ! ఏదో పాతకాలపుదాన్ని.... వివరంగా చెప్పందే నాకేం తెలుస్తుంది?"

"అలా అనటం ఇప్పుడు పాతబడిపోయింది. అలా విన్న వెంటనే ఇలా అంది పుచ్చుకోవాలి.... నాతో రమ్మంటే వచ్చావుకాదు. వచ్చుంటే ఎంత బావుండేది!"

"సరే, ఏం ఘనకార్యం చేసొచ్చారో ముందు చెప్పండి."

"నన్ను ప్రెసిడెంటుగా ఎన్నుకున్నారు" అన్నాడాయన గర్వాతిశయంతో భుజాలెగరేస్తూ.

"దేనికి ప్రెసిడెంటు?"

"ప్రోగ్రెసివ్ హజ్బెండ్స్ అండ్ వైవ్స్ అసోసియేషన్ స్థాపించాములే:"

"అంటే?"

"అభ్యుదయ భావాలుగల భార్యాభర్తల సంఘ మన్నమాట!"

"అభ్యుదయ భావాలంటే?"

"చచ్చాం.... నీకే భాషలో చెపితే అర్థమవుతుంది?"

"ఏ భాషయినా ఫర్వాలేదు........ అర్థమయ్యేలా చెప్పండి!" అందామె చేతులు త్రిప్పుతూ.

"అభ్యుదయ భావాలంటే.. సంఘానికి, దేశానికి, వ్యక్తికీ మేలుచేసే భావాలు – అని అర్థం! ఉదాహరణకి వరకట్న నిర్మూలనం; కుటుంబ నియంత్రణాన్ని ప్రోత్సహించటం...."

"మహిళా సంవత్సరం.... ఉద్ధరింపు.... అవీ అయిపోయాయి. ఇదో క్రొత్తగోల [illegible]"

"నీ వెటకారం పాడుగాను. పూర్తిగా వినవేం? మా సంఘంలో అప్పుడే ముప్పయిమంది భార్యాభర్తలు సభ్యులుగా చేరారు తెలుసా!"

కాత్యాయిని పకపకా నవ్వింది "అంటే ఈ పూళ్ళో తక్కినవాళ్ళంతా పెళ్ళిళ్ళు చేసుకోకుండానే సంసారాలు చేస్తున్నారటండీ?"

"పోవే, కూపస్థ మండూకానికి నీకే మర్థమవుతుంది!"

కాత్యాయిని ముఖం ముడుచుకుంది.

తండ్రికి మంచినీళ్ళ గ్లాసందిస్తూ "ఏదయినా తీర్మానం చేశారా నాన్నా!" అని అడిగింది సుశీల.

"అవునమ్మా! వచ్చే ఆదివారంలోగా మాలో ప్రతి ఒక్కడూ కనీసం క్రొత్త సభ్యుడ్ని ఒక్కడినయినా చేర్పించాలని మొదటి తీర్మానం. ఆదివారం సాయంత్రం అంతా కలిసి 'ప్లెడ్జ్' చేయాలని రెండో తీర్మానం....ఏమేవ్! నువ్వూ రావాలి. అందులో ప్రెసిడెంటు పెళ్ళాని వి కూడాను...."

"ప్లెడ్జో పెనమో నా కర్థమవుతుందా ఏమన్నానా?"

"అదేమిటో మీ అమ్మకి చెప్పమ్మా!"

సుశీల నవ్వులో జీవంలేదు. మాటాడకుండా పక్కగదిలోకి వెళ్ళిపోతున్న కూతుర్ని చూసి తెల్లబోయాడు సుందరం గారు!

ఆయన పడక్కుర్చీకి దగ్గరగా కుర్చీ పీట లాక్కుంటూ "మీరు చెప్పకూడదా యేం?" అంది కాత్యాయిని గోముగా.

"పిచ్చిదానా! నీకాకపోతే ఎవర్కి చెపుతాను!.... కాలం మారింది, ఒప్పుకుంటావా?....

"ఆ! అలాగే మారిందంటున్నారంతా! మరి మారే వుండాలి?" అందామె అమాయకంగా

"కనుక మనంకూడా మారాలి!"

"నా కర్థం కావటంలేదు - మీరనేదేమిటో!"

"అర్థం చెపుతా విను మరి! కట్నం పుచ్చుకోకూడదు. కట్నం ఇవ్వకూడదు..! అలాగని మనం.... అంటే నువ్వూ, నేనూ తల్లిదండ్రులమంతా ప్లెడ్జ్ చేయాలి. అంటే ప్రతిజ్ఞ చేయాలి. రేపాదివారమే ముహూర్తం! పెద్ద ఉత్సవంలా జరుపుతారు. ఇకప్పుడు మన పేరెలా మ్రోగిపోతుందో చూడు.... మన ఫొటో పత్రికల్లో అచ్చవుతుంది. వాడవాడలా మన సంగతే చెప్పుకుంటారు జనం. అప్పుడు.... ఓహో!...."

చిత్రంగా చూసింది కాత్యాయిని "మీగ్గాని మతి పోయిందా?"

"సంఘంలో మార్పు రావాలి అన్న వాడ్ని మొదట్లో అంతా నీలాగే అంటారు" అన్నారు సుందరంగారు గంభీరంగా ముఖం పెట్టి!

"కొంచెం కలలు కట్టిపెట్టి కళ్ళెట్టుకు చూడండి. అమ్మాయికి, అబ్బాయికి సంబంధాలు ఖాయం చేసుకోటానికి సిద్ధాంతిగార్ని పంపించిన సంగతి ఏమన్నా గుర్తుందా అసలు?"

లోపలి గదిలో —

"నాన్నగారు ప్లెడ్జి అంటే ప్రతిజ్ఞ అన్నారు కాని.... మరి నా పాఠంలో ప్లెడ్జి అంటే తాకట్టు పెట్టటం అని అర్థముందక్కా!" అంది శారద.

"అదీ యిదీ.... రెండర్థాలూ వున్నాయిలే!.." అని ఓక్షణం ఆగి "..ఆదివారం



## తెల్ల వెంట్రుకలుండవు

పొగడడం మాకు ఇష్టంలేదు. కాని మా 'కేష్‌రంజన్' ఆయుర్వేదిక్ పెంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగా మార్చును. మొదట తెల్ల వెంట్రుకలను నల్లవిగా మార్చి, ఆటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి కంటిచూపు వృద్ధి పరచును. లాభం పొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రు. 12/-.

SHYAM AYURVED BHAVAN (S-5)
p. o. Katri Sarai (Gaya)

## క్రొత్త రూపకల్పన
(హోం సినిమా ప్రొజెక్టరు)



మీరు మీ కుటుంబం, స్నేహితులు సినిమా హాళ్ళలో మాదిరిగానే రంగుల బొమ్మలు కదలటం, డాన్సింగ్, యాక్టింగ్ అన్నీ చూడగలరు. 35 mm ఫిలిమ్ ఉపయోగించాలి. అది ఎలక్ట్రిసిటీ లేదా బ్యాటరీపై నడవవచ్చును. 25 గ॥ల ఫిలిం & ఇలస్ట్రేటెడ్ ఇన్‌స్ట్రక్షన్ ఉచితం. ధర రు. 30/-లు, పోస్టేజి రు. 7-50. జర్మన్ మోడల్ (Sup) ధర రు. 45/-లు. పోస్టేజి రు. 8-50. రిఫైన్డ్ స్క్రీన్ రు. 5/-అదనంగా ప్రతి గజం ఫిలిం 25 పైసలు.

## ఆరు షాట్ల పిస్తోలు
(లైసెన్సు అవసరం లేదు)



రష్యన్ మోడల్ ఆటో మేటిక్ పిస్టల్ దొంగలు, క్రూరమృగముల బారి నుండి మిమ్ము కాపాడుకోండి. డ్రామా, సర్కస్‌వారికి మంచి ఉపయోగకరమైనది. 100 షాట్లు ఉచితం. ధర నెం. 555 రు. 14-50. డీలక్స్ (నెం. 777) రు. 24/-, బెల్టుతో క్రోమ్‌లెదర్ కేస్ (Sup) రు. 10/-లు అదనంగా ప్రతి వందషాట్లు రు. 2/-. పోస్టేజి రు. 4/-. ఇంగ్లీషు లేదా హిందీలో వ్రాయండి.

VIJAY AGENCIES (AJV)
Chhapeti, ALIGARH (U. P.)


నాన్నగారు చేయబోయే పని కూడా రెండర్థాలున్నాయి శారదా!" అంది సుశీల ఎటో చూస్తూ.

"అంటే?"

బయిటి గదిలో—

కాత్యాయిని పగలబడి నవ్వింది.

"....ఎందుకా వెర్రినవ్వు?" సుందరం గారు విసుక్కున్నారు.

"అహ! పెద్దో ఏదో అన్నారు చూడండి. అదంతా పైపై వ్యవహారమన్న మాట!"

"నోర్మూసుకోవే!"

"మూసుకుంటాను. మూసుకునేముందు ఓ ముక్క చెప్పనివ్వండి. కానీ కట్నం పుచ్చుకోకుండా జానకిరామయ్యగారి కూతుర్ని కోడలిగా తెచ్చుకోటానికి మీరు సిద్ధంగా వున్నారేమో మరి! సుశీలని కోడలిగా చేసుకోటానికి వెంకట్రావుగారు అమాంబాపతు ఆరు వేలకి తగ్గరని సిద్ధాంతిగారు చెప్పే వెళ్ళారు. పాపం, పెద్ది కబుర్లలో పడి పిల్లల పెళ్ళిళ్ళ సంగతి మర్చిపోయి నట్టున్నారు మీరు!...."

లోపలి గదిలో—

".... అడిగిందానికి చెప్ప వేమక్కా?" అని శారద రెట్టించింది.

"మరి కొన్నాళ్ళు పోతే నీకే అర్థమవుతుందిలేవే?"

"అంటే ఎప్పుడు?"

"నువ్వు పెద్దదానివవుతావు. అప్పుడు!"

బయిటి గదిలో—

"....నేనేం మర్చిపోలేదు."

"అంటే? పెట్టే ఒట్టులన్నీ ఒట్టొట్టివేనా! మరి చెప్పరేం!"


"ఛ! ఇలా ఎక్కడా అనకే! వింటే నవ్విపోతారు."

"నేనన్నదానికెవ్వరూ నవ్వరు. ఎందుకంటే. జరుగుతున్నది.. అందరికీ తెల్సు కనుక. మీరు చేసే పని చూస్తేనే అంతా నవ్వుతారు, ఏదో ఘనకార్యం చేస్తున్నానని మురిసిపోతున్నారు పాపం! పుచ్చుకోవటం తప్పనప్పుడు ఇవ్వటం తప్పనప్పుడు....కనీసం, ఈ అబద్ధపు ప్రతిజ్ఞ లయినా తప్పించుకోవచ్చుగా!"

"నోర్మూసుకోవే! చెప్పటమూ తెలియదు.... చెయ్యటమూ తెలియదు...."

"అంటే, ఏమిటంటారు?"

"నా కొడుక్కి కానీ కట్నం అక్కర్లేదయ్యా అని జానకిరామయ్యకి నేనెప్పుడో చెప్పాను. సుశీలని కోడలుగా చేసుకోటానికి మరి వెంకట్రావుగారు కావాలంటున్నాడు— ఆయనచేత కట్నంలేని పెళ్ళి కొప్పించనయినా ఒప్పించు— లేక ఆయన కావాలన్నది ఇవ్వనయినా యివ్వు— అని కూడా




చెప్పాను. ఇప్పుడు చెప్పు. మధ్యలో నేనేమన్నా ఉంచుకుంటున్నానా? అంటే ఓ విధంగా నేనిచ్చినట్టూ కాదు- పుచ్చుకున్నట్టూ కాదు. తెల్సిందా?"

"మరి వెంకట్రావుగారు దిగిరావటం లేదని సిద్ధాంతిగారు చెప్తూనే ఉన్నారు కదా!"

"నీ పిచ్చిగాని అందరికీ మనలాంటి విశాలహృదయమే ఉంటుందేమిటి!"

లోపలి గదిలో—

"దీనికర్థమేమిటక్కా?" శారద అడిగింది.

"డిక్షనరీ చూసుకోవే."

"నువ్వు చెప్పకూడదేమిటి?"

"సరే....అడుగు!"

"సెల్ఫ్ డిసీట్ అంటే?"

"ఇప్పుడు నాన్న చేస్తున్నపనే!" అంది సుశీల పరధ్యానంగా.

"నాన్నేం చేస్తున్నారు?" కుతూహలంగా అడిగింది శారద.

సుశీల స్పృహలోకి వచ్చింది. "ఏం లేదు....ఏంలేదు...." అని గొణిగింది.

"ఏమిటేమిటో అంటున్నావు - దీని కర్థం చెప్పలేదు."

ఓ క్షణం ఆగి "....ఆత్మవంచన అని అర్థం!" అంది సుశీల.

"బావుంది. అర్థమయ్యే మాటల్లో చెప్పకూడదేమిటి?"

"మరి కొన్నాళ్ళు పోతే నీకే అర్థమవుతుందిలే!"

"అంటే ఎప్పుడు?"

"నువ్వు పెద్దదానివవుతావు. అప్పుడు!"

★